క్లుప్తంగా

వాహనాల తనిఖీ



నల్లబెల్లి: శాసన సభ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని రుద్రగూడెం శివారులోని జాతీయ రహదారిపై గురువారం ఎస్సై నైనాల నగేష్ వాహనాలను తనిఖీ చేశారు. లారీలు, కార్లు, ఆటోలు నిలిపి వాహనాల డిక్కీలో ఉన్న సరుకులను పరిశీలించారు. సుమారు రెండు గంటల పాటు జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు చేశారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది, బీఎస్ఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

ఎంసీపీఐ(యూ) బైక్ ర్యాలీ

గీసుకొండ: మండలంలోని మచ్చాపూర్ ఓంకార్ స్థూపం నుంచి వరంగల్– నర్సంపేట రహదారిపై ఎంసీపీఐ(యూ) నాయకులు, కార్యకర్తలు గురువారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. బీఎల్ఎఫ్ బలపరిచిన ఎంసీపీఐ(యూ) పరకాల నియోజకవర్గ అభ్యర్థి గోనె కుమారస్వామి గెలుపుకోసం ర్యాలీ చేపట్టారు. జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, రాష్ట్ర కార్యదర్శి మంద రవి, జిల్లా నర్రా ప్రతాప్, కుసుంబ బాబూరావు, కనకం సంధ్య పాల్గొన్నారు.

మట్టి అందజేత

ఖానాపురం: మండలంలోని పలు గ్రామాల్లో మేరా దేశ్ మేరా మిట్టి కార్యక్రమంలో భాగంగా సేకరించిన మట్టిని నెహ్రూ యువజన కేంద్ర సంఘటన్ నర్సంపేట యూత్ కోఆర్డినేటర్ పురుషోత్తం యాదవ్‌కు గురువారం అందజేశారు. పాకాలలో మట్టితోపాటు నీటిని సేకరించారు. అనంతరం ఎంపీడీఓ సుమనవాణి, ఎన్వైకేఎస్ కోఆర్డినేటర్ పురుషోత్తంయాదవ్ మాట్లాడారు. ఈనెల 30, 31, నవంబర్ 1తేదీల్లో ఢిల్లీలో జరిగే మేరా మిట్టి మేరా దేశ్ కార్యక్రమంలో మట్టిని అందించనున్నట్లు తెలిపారు.

బాధితుడి కుటుంబానికి పరామర్శ

నల్లబెల్లి: మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన శనిగరం మొగిలి(45) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. నర్సంపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాలెపు రాజేశ్వర్ రావు మృతుడి కుటుంబ సభ్యులను పరరామర్శించి రూ.5వేలు అందించారు. మృతదేహం పై పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ చీకటి ప్రకాశ్, మాజీ సర్పంచ్ గొనే రాంబాబు, ఎంపీటీసీ పాలెపు రవీందర్ రావు, దేవేందర్, చేరాలు, మధు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలకు కృషి చేయాలి

పర్వతగిరి: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి చదువుల సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు మండలంలోని చౌటపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను గురువారం సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, సమ్మేటివ్-1 పరీక్ష ఫలితాలను పరిశీలించారు. విద్యార్థులు సాధించిన ఫలితాల ఆధారంగా విషయ బోధన తీరులను మార్పులు చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అనంతరం మండల విద్యావనరుల కేంద్రంలో ఎమ్మార్సీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని, సీసీఈ మార్క్స్ ఎంట్రీ, సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా వచ్చే ఆన్‌లైన్ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల సందర్శనలో చౌటపల్లి ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆచార్య ప్రద్యుమ్న, రమేష్, చౌటపల్లి ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సోమయ్య, శిల్ప, జయరాజ్, ప్రవీణ్, శ్రీనివాస్, లోకేష్, సుధ, రజిత, సంధ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జావిద్

గీసుకొండ: మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గీసుకొండకు చెందిన ఎండీ జావిద్ నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గురువారం నియామక ఉత్తర్వులను జారీ చేసినట్లు పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎల్లగౌడ్

వర్ధన్నపేట: పట్టణానికి చెందిన వడ్లకొండ ఎల్లగౌడ్‌ను కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు జిల్లా చైర్మన్ ఓర్సు తిరుపతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ నియామక ఉత్తర్వును అందజేశారు.

కమిటీ సభ్యుల నియామకం

చెన్నారావుపేట: కాంగ్రెస్ పార్టీ చెన్నారావుపేట మండల కమిటీ సభ్యులను మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు దొంతి మాధవరెడ్డి గురువారం నియామక పత్రం అందించారు. కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులుగా మాణిక్యం తండాకు చెందిన భూక్య మోహన్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా భూక్య నర్సునాయక్, కార్యదర్శిగా పదహారు చింతల్ తండాకు చెందిన బానోతు రమేష్‌నాయక్‌ను నియమించినట్లు తెలిపారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు



సంగెంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నెక్కొండ: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నెక్కొండ సీఐ హథీరాం నాయక్ సూచించారు. ఇందులో భాగంగా మండలంలోని గొల్లపల్లి, చంద్రుగొండ గ్రామాల్లో గురువారం సాయంత్రం ఎస్సై షేక్ జానీపాష ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతీ ఓటరు నిర్భయంగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కు వేయాలని సూచించారు. ఎన్నికల వేళ నమోదైన కేసులతో ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సీఐ హెచ్చరించారు. ప్రజల కోసం మేమున్నామన్న భరోసా కల్పించేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని ఆయన చెప్పారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

సంగెం: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పర్వతగిరి సీఐ శ్రీనివాస్ అన్నారు. గురువారం సంగెం, కుంటపల్లి, గవిచర్ల, రామచంద్రాపురం, లోహిత గ్రామాల్లో బీఎస్ఎఫ్ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో గ్రామాల్లో ఎలాంటి అలజడులు, గొడవలు లేకుండా శాంతియుతంగా ఉండేలా అన్ని వర్గాలవారు సహకరించాలన్నారు. సంగెం, పర్వతగిరి ఎస్సైలు భరత్, వీరభద్రరావు పాల్గొన్నారు.

కేసీఆర్ మాయ మాటలను నమ్మొద్దు

● మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



సదస్సులో అభివాదం చేస్తున్న నాయకులు

గీసుకొండ: సీఎం కేసీఆర్ మాయమాటలు చెప్పి ప్రజలను మోసగించి పాలన చేశారని, మరోసారి నమ్మి మోసపోవద్దని పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. గురువారం మరియపురం సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ మహిళా సదస్సులో ఆయన మాట్లాడారు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కేంద్రంలోని మోదీ సర్కారుదని కొనియాడారు. జాన్‌విక్రం, పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ కాళీ ప్రసాద్, గట్టికొప్పుల రాంబాబు, జయంతిలాల్, బండారి కల్యాణి, ముల్క ప్రసాద్, గోదాసి చిన్న తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారం మానుకోవాలి

నర్సంపేట: భారతీయ జనతా పార్టీ నుంచి నర్సంపేటలో పోటీ చేసే నాయకులు ఎవరూ లేరని బీజేపీ కార్యకర్తలను మభ్యపెడుతూ మా పార్టీలోకి రావాలంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారం మానుకోవాలని నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్‌లు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం బీజేపీ శక్తి కేంద్ర, బూత్ అధ్యక్షుల సమావేశం పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్ అధ్యక్షతన నిర్వహించారు. రాజు, రామాంజనేయులు, జూలూరి మనీష్, సందీప్, ప్రవీణ్, విజయ్‌సింగ్, కిట్టు, సప్తగిరి, ఆకాష్, గణేష్ పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఎగురవేస్తాం

ఖానాపురం: నర్సంపేటలో బీజేపీ జెండా ఎగురవేస్తామని రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి మదన్మోహన్‌రావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోమల్‌రెడ్డి, రమేష్, మల్లారెడ్డి, శ్రీనివాస్, శివ, లింగబత్తుల యాకస్వామి, కుమారస్వామి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



బీఆర్ఎస్‌లో చేరినవారితో పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట: బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని నర్సంపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామ వడ్డెర సంఘానికి చెందిన పది కుటుంబాలు, నర్సంపేట పట్టణం 14వ వార్డు కాంగ్రెస్, ఇతర పార్టీలకు చెందిన 25కుటుంబాలు, నర్సంపేట మండలం గురిజాల గ్రామం నుంచి కక్కెర్ల వీరస్వామి, కక్కెర్ల వెంకటేష్ పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, నాయకులు మనోహర్‌రెడ్డి, మోతె జైపాల్‌రెడ్డి, మంచిక దేవేందర్, అశోక్, వేణుచంద్, గాలి శ్రీనివాస్, శ్రీనివాస్, రహీం, నిజాం పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంతోనే సమస్యలు తీరుతాయి

మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



ప్రచారం చేస్తున్న నాగరాజు

నర్సంపేట: తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వస్తేనే పేదల సమస్యలు తీరుతాయని కాంగ్రెస్ పార్టీ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని లెనిన్ నగర్‌కు చెందిన 30కుటుంబాలు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాకు పక్కా ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, కాలనీలో సరైన వసతులు లేవని మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం జరిగిన సమావేశంలో దొంతి మాధవరెడ్డి మాట్లాడారు.

ఖానాపురం: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని మనుబోతులగడ్డ, కొడ్తిమాటుతండ, ఖానాపురం గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జగన్మోహన్‌రెడ్డి, రవీందర్ రావు, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు. అశోక్ నగర్‌లో నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్ రావు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.

అవినీతి పాలనకు చరమగీతం పాడాలి

వర్ధన్నపేట: బీఆర్ఎస్ అవినీతి ప్రభుత్వ పాలనకు చరమగీతం పాడాలని మాజీ ఐపీఎస్ అధికారి, కాంగ్రెస్ నేత కె ఆర్ నాగరాజు అన్నారు. గురువారం వర్ధన్నపేట పట్టణంలో బీఆర్ఎస్ బీసీ సెల్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు సిలువేరు శ్రీధర్ యాదవ్, వడ్డెర సంఘం నాయకులు ఓర్సు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు వడ్డెర సంఘం నాయకులు కేఆర్ నాగరాజు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బోంపెల్లి దేవేందర్‌రావు, ఎద్దు సత్యనారాయణ, చోటేమియా, పోశాల వెంకన్న, కృష్ణారెడ్డి, కుమారస్వామి, చందు సాయిలు పాల్గొన్నారు.

‘రైతుబంధు’ను అడ్డుకోవడం సరికాదు



గిర్నిబావిలో మాట్లాడుతున్న ఆకుల శ్రీనివాస్



నల్లబెల్లి: మాట్లాడుతున్న బానోత్ సారంగపాణి

దుగ్గొండి: యాసంగి రైతు బంధు నిధులు విడుదల చేయొద్దని కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు చేయడం సరికాదని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ అన్నారు. గిర్నిబావిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు బంధు నిధులు రాకుండా ఆపడం, గృహలక్ష్మి, దళిత బంధు, బీసీ బంధుపై స్వయంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఫిర్యాదు చేయడం సిగ్గు చేటన్నారు. రుణమాఫీ కొంత మంది రైతులకు కావాల్సి ఉందని, కాంగ్రెస్ కారణంగా బ్యాంకుల్లో జమ కాకుండా నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలలో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టడానికి సిద్ధమయ్యారని ఆయన అన్నారు. సమావేశంలో ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, కంచరకుంట్ల శ్రీనివాసరెడ్డి, మేర్గు రాంబాబు, ఊరటి మహిపాల్, రేవూరి సురేందర్‌రెడ్డి, మంద శ్రీను, పుచ్చకాయల బుచ్చిరెడ్డి, రజినీకర్‌రెడ్డి, ప్రశాంత్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నల్లబెల్లి: రైతు బంధు పథకాన్ని ఆపాలని కోరుతూ ఎన్నికల కమిషన్‌కు వినతి పత్రాన్ని అందించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా రైతు బంధు పథకాన్ని అమలు చేస్తుందన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన ఈ పథకాన్ని కాంగ్రెస్ నాయకులు అడ్డుకోడాన్ని తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు బంధుతో పాటు 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ, దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి పథకాలను అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. సమావేశంలో ఊడుగుల ప్రవీణ్ గౌడ్, చెట్టుపల్లి మురళీధర్, పాలెపు రాజేశ్వర్ రావు, గందె శ్రీనివాస్ గుప్తా, కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే పథకాల అడ్డగింత

ఖానాపురం: కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓటమి భయంతోనే ప్రభుత్వ పథకాలను అడ్డుకుంటున్నారని ఎంపీపీ ప్రకాశ్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో మార్కెట్ కమిటీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, రమేష్, బాలునాయక్, మస్తాన్, వల్లెపు శ్రీనివాస్, దాసరి రమేష్, పూర్ణచందర్, రవి, రాజునాయక్ పాల్గొన్నారు.

‘చల్లా’కు హ్యాట్రిక్ విజయం అందించాలి

గీసుకొండ: అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని మూడోసారి గెలిపించడానికి కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ విలీన గ్రామాల ఎన్నికల ఇన్‌చార్జ్ చింతం సదానందం, సీనియర్ నాయకుడు సుంకరి శివ అన్నారు. గురువారం గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారంలో బూత్ కమిటీల కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మార్కెట్ డైరెక్టర్ గోలి రాజయ్య, పోగుల సంజీవ, రమేశ్, కందుల శ్రీనివాస్‌రెడ్డి, గాదె బాబు, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను రైతులు నిలదీయాలి

చెన్నారావుపేట: ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను రైతులు నిలదీయాలని మండల ఇన్‌చార్జ్, రాష్ట్ర ఆర్‌బీఎస్ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు రైతు బంధు పథకాన్ని ఆపాలని ఎన్నికల కమిషన్‌కు వినతి పత్రం అందించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మండల కేంద్రంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పాత మగ్దుంపురంలో బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోను ఆవిష్కరించి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ పత్తినాయక్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు మహ్మద్ రఫీ, బుర్రి తిరుపతి, తూటి శ్రీనివాస్, సర్పంచ్ మల్లయ్య, రాంరెడ్డి, కృష్ణచైతన్యరెడ్డి, రవి ఉన్నారు.

సంగెం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి సారంగపాణి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కుంటపల్లి, సంగెం, తిమ్మాపూర్, ఎల్గూర్‌స్టేషన్, షాపూర్, రామచంద్రాపురం గ్రామాల్లో గ్రామ పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించి బూత్ కమిటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జక్క మల్లయ్య, దొనికెల మల్లయ్య, చొల్లేటి వీరాచారి, మన్సూర్ అలీ, యార బాలకృష్ణ, జున్న రాజు, పెండ్లి పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను నిలిపివేయాలని కోరడం సరికాదు

నర్సంపేట రూరల్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిలిపివేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీనాయకులు ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేయడం సరికాదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ అన్నారు. నర్సంపేట మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మోతె సమ్మిరెడ్డి, గోపాల్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, ఈర్ల నర్సింహారాములు, భూక్య వీరన్న, రాంప్రసాద్, కుమారస్వామి, సుదర్శన్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిస కావొద్దు



మాట్లాడుతున్న ఎస్సై జానీపాషా

నెక్కొండ: యువత వ్యసనాలకు బానిస కావొద్దని ఎస్సై జానీపాషా అన్నారు. మండలంలోని బొల్లికొండలో గురువారం రాత్రి పోలీస్ కళాబృందంచే నిర్వహించిన కళా జాత కార్యక్రమంలో ఎస్సై పాల్గొన్నారు. కళాజాత బృందం బాల్య వివాహాలు, షీ టీమ్, నేటి యువత గంజాయి, గుట్కా, డ్రగ్స్ వల్ల తమ జీవితాలు ఎలా కోల్పోతున్నారో వివరించారు. అన్ని రంగాల్లో యువత పాత్రే కీలకమన్నారు. నేటి యువత కొన్ని బలహీనలతకు బానిసలై తమ కుటుంబాలకు తీరని అన్యాయం చేస్తున్నారని అన్నారు. సమాజంలో నెలకొన్న అసమానతలను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన సూచించారు. డయిల్ 100, సీసీటీవీ కెమెరాలు, సైబర్ నేరాలు, వృద్ధాప్య తల్లిదండ్రుల పట్ల వివక్షత తదితర అంశాలపై ఎస్సై వివరించారు. సర్పంచ్ బానోతు శ్రీధర్‌నాయక్, కళాజాత బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు




పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాధవరెడ్డి

నర్సంపేట: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు ఖానాపురం మండలం దబ్బీర్‌పేట గ్రామం బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు, చెన్నారావుపేట మండలం చెరువుకొమ్ముతండా నుంచి బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు ఆయా పార్టీలకు రాజీనామా చేసి గురువారం దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

నెక్కొండ: మండంలోని రెడ్లవాడ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల చంద్రయ్య, ఉప సర్పంచ్ బర్ల వీరభద్రయ్య, గ్రామ అధ్యక్షుడు గడుదాసు వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ గొలుసు రమేష్, గుండెబోయిన దేవేందర్‌లతోపాటు పలువురు గురువారం దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బక్కి అశోక్, ఎంపీటీసీ సరోజశంకర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట: మండలంలోని చెరువుకొమ్ముతండాకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు గురువారం దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వార్డు సభ్యురాలు భూక్య అరుణ, రవి, రవినాయక్, స్వామి, గోపి, గోపాల్‌నాయక్, మొగిళి వెంకట్‌రెడ్డి, యాకయ్య, రమేష్, సదయ్య ఉన్నారు.

కులం, మతం కాదు అభివృద్ధి, వ్యక్తి ముఖ్యం



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వర్ధన్నపేట : మాదిగ సామాజిక వర్గానికి టికెట్ ఇవ్వాలని మాదిగలు డిమాండ్ చేయడం సమంజసం కాదు.. మాదిగలకు రెండు సీట్లు ఇస్తే మాలలకు ఒక్క సీటైనా ఇవ్వాల్సిందే కదా అని కాంగ్రెస్ నేత కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం వర్ధన్నపేట పట్టణంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న క్రమంలో విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ఇక్కడ కులం, మతం ముఖ్యం కాదు.. అభివృద్ధి, వ్యక్తి ముఖ్యం అని పేర్కొన్నారు. మంద కృష్ణమాదిగ వైరాలో పోటీ చేసినప్పుడు మాదిగలు ఓటేశారా లేక వర్ధన్నపేటలో పోటీ చేసినప్పుడు మాదిగలు ఓటేశారా అని ప్రశ్నించారు.

మంద కృష్ణ మాదిగను విమర్శించడం తగదు

సామాజిక ఉద్యమ నాయకుడు మంద కృష్ణమాదిగ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయాడని కాంగ్రెస్ నాయకుడు కేఆర్ నాగరాజు వ్యాఖ్యానించడం సరికాదని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. వర్ధన్నపేటలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎన్నికల్లో పోటీచేస్తే ఈ సమాజం ఓడించిందని తెలిపారు. నాగరాజు మాటలు నియోజకవర్గ పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదలు, ప్రజలందరు గమనిస్తున్నారన్నారు. తక్షణమే మంద కృష్ణ మాదిగకు క్షమాపణ చెప్పి, తన మాటటను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంద రాజు, బిర్రు మహేందర్, కట్ల రాజశేఖర్, గోలి సుధాకర్, చాతల్ల రమేష్, ఇస్సంపల్లి రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వర్ధన్నపేట: బైక్ అదుపు తప్పి కింద పడడంతో బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం దమ్మన్నపేట శివారులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పరపల్లికి చెందిన ముంజల యాకాంతం తన అల్లుడితో కలిసి గురువారం జఫర్‌గఢ్‌కు వెళ్లి పని ముగించుకుని తిరిగి బైక్‌పై తన అల్లుడు బొలగాని రాజుతో కలిసి వస్తుండగా దమ్మన్నపేట శివారులో బైక్ అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకు పోయి గోతిలో పడిపోయింది. యాకాంతం ఆయన అల్లుడు రాజు అపస్మారక స్థితిలో పడి ఉండగా చాలా సేపు ఎవరు గమనించలేదు. రోడ్డుపై వెళ్తున్న ఓవ్యక్తి వీరిని చూసి వెంటనే ఆటోలో వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాజు తలకు తీవ్ర గాయం కావడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

అరూరి గెలుపు కోసం పూజలు

వర్ధన్నపేట : బీఆర్ఎస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేష్ గెలుపొందాలని వర్ధన్నపేట, ఇల్లంద గ్రామాల్లోని పలు ఆలయాల్లో బీఆర్ఎస్ నాయకులు గురువారం పూజలు చేశారు. మునిసిపల్ కో ఆప్షన్ సభ్యుడు మాశెట్టి సోమయ్య, నాయకులు ఎండీ.అన్వర్, తోట రాజు, పెద్దబోయిన దేవేంద్ర, జాగిల్ల వీరస్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూల్ల కుమారస్వామి, సర్పంచ్ సుంకరి సాంబయ్య ఎంపీటీసీలు గొడిశాల శ్రీనివాస్, పిట్టల జ్యోతి ఆధ్వర్యంలో పాల్గొన్నారు. అనంతరం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

బహుమతుల ప్రదానం

పర్వతగిరి: మండలంలోని చింతనెక్కొండ గ్రామంలో యువ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టిర్నమెంట్‌లో విజేతలకు గురువారం అవార్డులు, బహుమతులను అందజేశారు. ఈ మేరకు టోర్నమెంట్ ఓవరాల్ ఛాంపియన్, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును గ్రామానికి చెందిన సీఐఎస్ఎఫ్ జవాన్ చెవులపెల్లి రజనీకాంత్ అందుకున్నాడు. ఈ సందర్భగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఇల్లందుల సుదర్శన్ విజేతలకు అవార్డులను అందించారు.

ఆర్థిక సాయం

చెన్నారావుపేట: మండల కేంద్రానికి చెందిన రమేష్ గత కొద్ది రోజులుగా బ్రెయిన్ కేన్సర్‌తో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకుని ఇంటికి వచ్చాడు. విషయం తెలుసుకున్న పాఠశాల మిత్రులు పరామర్శించి గురువారం రూ.26,500 అందించారు. కార్యక్రమంలో చింతకాయల లక్ష్మీనారాయణ, పడిదం శోభన్‌బాబు, మండల మల్లయ్య, నాంపెల్లి శ్రీనివాస్, లక్క స్వామి, రాములు, మజ్జిగ కుమారస్వామి, ఈశ్వర్, రమేష్, రాజన్న, ప్రభాకర్, కట్టయ్య, తదితరులు ఉన్నారు.

పుల్లారావుకు బీజేపీ టికెట్ ఇవ్వాలి

నర్సంపేట: బీజేపీ సీనియర్ నాయకుడు, విద్యావేత్త డాక్టర్ కంభంపాటి పుల్లారావు(ప్రతాప్)కు నర్సంపేట నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా టికెట్ కేటాయించాలని బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ జూలూరి మనీష్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం యువమోర్చా నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంభంపాటి పుల్లారావు(ప్రతాప్)కు బీజేపీ అసెంబ్లీ టికెట్ కేటాయించాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. తీర్మాన కాపీలను తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎన్నికల క్యాంపెనింగ్ ఈటెల రాజేందర్, సునీల్ బన్సల్, ప్రకాష్ జయదేకర్, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, గరికపాటి మోహన్‌రావులకు పంపించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ బీజేవైఎం అధ్యక్షుడు గూడూరు సందీప్, అంబేడ్కర్, పోతురాజు రాజు, సాయి, ఠాకూర్ విజయ్‌సింగ్, సామల ప్రవీణ్, కోమండ్ల సప్తగిరి, కిట్టు, రాజేష్, గణేష్, శివమణి, కార్తీక్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

చెన్నారావుపేట: బీఆర్ఎస్ యూత్ విభాగం మండల కార్యదర్శిగా లింగగిరి గ్రామానికి చెందిన దాసరి రామును ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు యూత్ మండల ఇన్‌చార్జ్ కంది కృష్ణ చైతన్యరెడ్డి గురువారం తెలిపారు.

దుగ్గొండి: బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటాపురం గ్రామానికి చెందిన గోర్కటి రాజుకుమార్, మండల ప్రచార కార్యదర్శిగా మంద అనిల్ ఎన్నికయ్యారు. ఈ మేరకు నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ గురువారం ప్రకటించారు.

మెరుగైన వైద్యం అందించాలి

నల్లబెల్లి / దుగ్గొండి : జ్వరాలతో బాధపడుతున్నవారికి మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్ఓ వెంకటరమణ వైద్య సిబ్బందిని ఆదేశించారు. నల్లబెల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం దుగ్గొండి మండలంలోని మల్లంపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, దుగ్గొండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ పరిశీలించి, డెలివరీలో ఏమైనా ఇబ్బంది జరిగిందా, సిబ్బంది సరిగా సేవలందించారా, కిట్ అందిందా, ఆరోగ్యం బాగుందా అని బాలింతలకు ఫోన్ చేసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. విధులకు హాజరు కానివారికి గైర్హాజరు వేశారు.

బీఆర్ఎస్ బూత్ కమిటీల ఏర్పాటు



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

గీసుకొండ: మండలంలోని ఎలుకుర్తి, ఆరెపల్లి, మనుగొండ, చంద్రయ్యపల్లి, గీసుకొండ, రాంపురం, కొనాయమాకుల గ్రామాల్లో గురువారం బీఆర్ఎస్ బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల ఎమ్మెల్యేగా చల్లా ధర్మారెడ్డిని లక్ష మెజారితో గెలిపించడానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్, జెడ్పీటీసీ ధర్మారావు కోరారు. నాయకులు చల్లా వేణుగోపాల్, భరత్, జయపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, ప్రకాశ్, నాగేశ్వర్‌రావు, మురళి, రాజయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.